# నేనే కవినైతే —

కొడవటిగంటి కుటుంబరావు

"నేనసలు కవి కావలసినవాణ్ణే. కాస్తలో తప్పిపోయింది. సాహితీసమితి ఇంచుమించు మా యింట్లోనే పుట్టి పెరిగింది. రోజూ నాకు కనిపిస్తూ, నన్ను పలకరించే శివశంకర శాస్త్రి గారూ, స్వామిగారూ, పూర్ణశర్మగారూ, బాబూరావుగారూ మొదలైన వాళ్ళంతా నేను చూస్తూండగా కవితా గోష్ఠి చేసేవారు. నాకు దగ్గరవాళ్ళయిన మా అన్నగారూ, నోరి, కూడా సాహితీ సమితిలో వాళ్ళేనాయె. వీళ్ళమధ్య పెరిగిన నేను కవిని కాకపోవటమే ఆశ్చర్యం కాని, ఐవుంటే ఆశ్చర్యం ఏమీ లేదు. కవి తమ్ముళ్ళయి ఉండి కవి కానివాళ్ళు చాలా అరుదు. నేనా అరుదు మనుష్యుల్లో వాణ్ణి.

అయితే నేను కవిత్వం రాయటానికి ప్రయత్నించకపోలేదు. నాకు పదమూడో ఏడు నడుస్తుండగా కవి కావాలనే ఆవేదన కలిగింది. కవిత్వం రాయాలంటే ఏంచెయ్యాలని మా బంధువొకాయన్ని అడిగాను. ఆయన నాకు "యమాతా రాజభానస" అనే తారకమంత్రం ఉపదేశించి, దాని ప్రకారం గణాలు చూసుకోమన్నాడు. బుద్ధికి తట్టిన ప్రతిమాటకూ, పేరుకూ గణాలు చూసుకుంటూ గణసాధన చేశా. ఆరోజుల్లోనే స్వరసాధన చేసుకుంటూ ఉండటం నా కభ్యాసంగా వుండేది, ఆ చేత్తోనే గణసాధన కూడా చేశానుకోండి.

ఆ తరవాత సులక్షణసారం కొని ఆ సులక్షణసారం చదవ నారంభించగానే నాకు కవిత్వం అంటే భయం ఆరంభమయింది. "యమాతా రాజభానస" వట్టి ఓనమాలని నాకు తెలిసివచ్చింది. ఇనగణాలూ, ఇంద్రగణాలూ, చంద్రగణాలూ కాక లగమూ, గలమూ మొదలైనవి చూస్తూంటే నాకు తారెత్తింది. ఈగుణింతమంతా సరి చూసుకునేకంటే హాయిగా చెవిని బట్టి రాసుకుంటేనే నయమనిపించింది. నా కప్పటికి ఫ్రీహాండు డ్రాయింగు అలవాటున్నది. ఆ పద్ధతినే ముందు స్థూలంగా పద్యాని కొకస్వరూపం ఇచ్చుకుని తరవాత neat line చేసుకోవచ్చు. మచ్చుకు చూడండి.

"కందము-నన-నన-నన అర
విందము-నన-నాన-ననన-పీనులలర ఆ
నందము-నానననా-మక
రందము-నన-నానన-రామన్న పాళా."

ఇట్లా outline తయారయినాక నకారాలు ఎత్తేసి అక్కడ మాటలు పెడితే అదే పద్యమవుతుంది. ఈ పద్ధతిని కొన్ని పద్యాలు రాసి ఒకసారి ప్రచురణార్థం పత్రిక్కి కూడా పంపాను. అదృష్టవశాత్తూ అవి అచ్చుకాలేదు. మంచిపనే అయింది ఎందుచేతనంటే మరికొంత కాలానికి నాకే తెలిసివచ్చింది - పద్యాలన్నీ నిజమైన కవిత్వం కావని.

ఛందస్సే కవిత్వమైతే ఇక లేనిదేమిటి? కాని అట్లా కాదు. అప్రయత్నంగా మనం నోటంట అనే మాటలు పద్యపాదాలవుతై. ఒక్కొక్క అదృష్టవంతుడు పేరు పద్యపాదం అయి ఊరుకుంటుంది. నన్నయభట్టారకుడివంటి మహాకవి "అనవిని యాతడిట్లనియె" అని వచనం రాస్తే అది పద్యంగా పరుగెత్తుతుంది. "పిలకా గణపతి శాస్త్రి" అన్నా 'సోమయాజుల వేంకటరామమూర్తి" అన్నా పద్యపాదాలే. 'కొరకరాని కొయ్య కొడవటిగంటి కుటుంబరావు" అని ఆరంభిస్తే అప్పుడే పద్యం నడుస్తున్నది. కాని ఇది అంతా కవిత్వమా? ఒక్కనాటికీ కాదు.

ఈ సంగతి గ్రహించగానే కవిత్వమంటే నాకు మరింత భయంవేసింది. కవిత్వం రాయాలంటే ఛందస్సు కాక ఇంకేదో ఉండాలి. అది ఉంటే వచనం రాసినా కవిత్వమే అవుతుంది. చూడండి:

"ఏదేశ చరిత్రమూసినా,
ఏమున్నది గర్వకారణం?
నరజాతి చరిత్ర సమస్తం,
పరపీడన పరాయణత్వం"

ఇంకోటి చూడండి:

"నిజంగానే నిఖిలలోకం
నిండుహర్షం వహిస్తుందా
మానవాళికి నిజంగానే
మంచికాలం రహిస్తుందా
నిజంగానే, నిజంగానే
నిఖిలలోకం హసిస్తుందా
దారుణ ద్వేషాగ్నినిండే
దానవత్వం నశిస్తుందా"

ఇది కవిత్వమే. గాని ఇందులో ఉషస్సులూ, విపంచులూ, తమస్సులూ, ఎడపలు, నిర్ఘరులూ మొదలైన పదజాలం లేదు. అటువంటి అర్థం గాని మాటలుంటేనే కవిత్వమవుతుందనే భ్రమ కూడా పోయింది. కాళిదాసులోనూ, నన్నయ భట్టులోనూ, శ్రీనాథుడిలోనూ, కృష్ణశాస్త్రిలోనూ, శ్రీశ్రీలోనూ ఉండేదేదో నాలో లేదు. వాళ్లు కవులు, నేను కాను. ఒకటికి పదిసార్లు అనుకుని ఏం లాభం?

ఒకవేళ వారిలో ఉన్నదేదో నాలో కూడా ఉంటే ఏం చేస్తాననేది ప్రశ్న. అలాగు అంతుం టుందా? ఎన్నైనా చేద్దామనే ఉంటుంది. అయినా టూకీగా చెబుతాను.

ఈ కాలంలో పుట్టాను గనక నాకు సంస్కృతం రాదు గాని అందరూ భోజనాల దగ్గిరా వీధిలోనూ కూడా సంస్కృతమే మాట్లాడే ఆ రోజుల్లో — దర్శనమాత్రం చేతనే ప్రతివాడిలోనూ కవితా శక్తి కలిగించిన ఆ భోజుడి కాలంలో—పుట్టి కాళిదాసు లాగా కవిత్వం చెప్పి ఉంటే ఎంత బాగుండును. ఎప్పుడూ కవిత్వంలో ఓలలాడుతూ, వింజామరలు వీచే దాసీదాని చేతి గాజుల చప్పుడుమీదా, అందగత్తెలైన దాసీజనం మీదా పద్యాలు చెబుతూ, భోజుడిచ్చే సమస్యలు పూరిస్తూ, పూర్ణిమ రాత్రులందు ప్రచ్ఛన్నంగా భోజుడి వెంట ఉజ్జయినీపుర వీధుల్లో తిరుగుతూ ఉండే వాణ్ణే.

భోజుడు కవితా ప్రియుడే గాని, పాపం, మంచికవి గాదు. 'చరమగిరి నితంబే చంద్ర బింబం లలంబే' అని ఎవరైనా అనుకోవచ్చు. 'యువతిజన కదంబే నాథముక్తోష్ఠబింబే' అనటం లోనే కవిత్వం ఉంది. కళ్ళఎదట కనపడే దృశ్యాన్ని మాటల్లో పెట్టినవాడు కవా? కంటికి కనిపించని దానికి ఒకరూపం కట్టటంలోనే కవిత్వం ఉంది. అట్లాగే, 'భోజనం దేహి రాజేంద్ర ఘృతసూప సమన్వితం' అనటానికి కవి కావాలా!

"మహిషంచ శరచ్చంద్ర చంద్రికాధవళం దధి', అని ఉత్ప్రేక్షించేటప్పటికి అది కవిత్వం అవుతుంది. ఆ విధంగానే భోజరాజు "దివా కాకరుత భ్రీతా" అనటంలో ఏమీ విశేషం లేదు. "దివా" అనటంలో ఏదో దాస్తున్నదనేది కూడా వెంటనే అర్థమైపోతుంది. అందులో గాంభీర్యం లేదు. భోజుడు ఆత్రంగా బయట పడిపోతున్నాడు. కాని "రాత్రౌ తరతి నర్మదాం" అనేటప్పటికి వినేవాడి భావన రేకెత్తుతున్నది. రాత్రివేళ నర్మదను తరించటం సాహసకార్యమే. కాని ఎందుకని ఒక ఆడది అర్ధరాత్రివేళ నర్మదను తరించాలి? ఏమో! మీరే ఊహించు కోండి. కవి అటువంటి చచ్చు వివరాలు చెప్పడు. భోజుడల్లేనే కాళిదాసు కూడా ఏదో దాస్తున్నాడు గాని చవుకబారుగా దాయటం లేదు. "తత్రసంతి జలే గ్రాహాః" అన్న ముక్క ఎంత కుర్రతనంగా ఉందో వేరే చెప్పనక్కర్లేదు. "మర్మజ్ఞా నైవ సుందరీ" అనటం చెప్పు తీసు కొట్టినట్టు మాత్రం ఉంది.

కవికి భావన ఉంటుంది. దానికి కవి వివశు డైపోడు దానికంటె పైగా పెరిగి దానిమీద తనకు గల అధికారం రుజువు చేసుకుంటాడు. కాళిదాసు వంటి కవి అందగత్తెను చూసి, "అయ్యో, నీ మెడకింది వొంపులు చూస్తుంటే నేనేదో అయిపోతున్నాను" అంటాడా? "కుచ భారాత్కుచ భారః, కచభారాత్ భీతిమేతికుచ భారః, కచకుచభారాత్ జఘనం, కోయం చంద్రాననే చమత్కారః!" అని ప్రశ్నిస్తాడు. భావన అనేది కవి వశమైనపుడే గద రససిద్ధి?

శ్రీనాథుడు "దాహం, దాహం" అని కేకలు వేస్తే ఎవరు చెప్పుకుంటారు?

"సిరి గలవానికి చెల్లును తరుణుల పదియారు వేల తగ పెండ్లాడన్. తిరిపెమున కిద్దరాండ్రా? పరమేశా గంగవిడుము, పార్వతి చాలున్" అన్నాడు గనక అది కవిత్వమయింది.

నిజంగా శ్రీనాథుడు గట్టివాడు. శ్రీనాథుడిలాగా నైషధమూ, కాశీఖండమూ, వీధినాటకమూ, పల్నాటి వీరచరిత్రా మొదలైనవి రాయాలని నాకు లేనేలేదు. నేనే కవినై ఉంటే శ్రీనాథుడులాగా ఆపత్ సమయంలో కూడా దర్జా కదలకుండా "కవిరాజు కంఠంబు కౌగలించెను గదా పురవీధి నెదురెండ పొగడదండ; 'సార్వభౌముని భుజస్కంధ మెక్కెను గదా నగరి వాకిటనున్న నల్లగుండు' అనీ, 'ప్రాణావసానదశలో సయితం' 'దివిజ కవివరు గుండియల్ దిగ్గురనగ అరుగుచున్నాడు శ్రీనాథుడమరపురికి." అనీ అనగలిగితే ఇంకేం కావాలి? కథలు రాసుకునే నాబోటివాడెవడైనా ఈ ఎత్తుకు పెరగ గలడా?

ఒక్కొక్కసారి ఆలోచిస్తే ఉదాత్తత కవినుంచి కవిత్వానికి సంక్రమిస్తుందా కవిత్వంనుంచి కవికి సంక్రమిస్తుందా అనేది తేల్చుకోవటం కష్టంగా ఉంటుంది. ఆ గొప్పతనమంతా కవిత్వంలోనే ఉందేమోననిపిస్తుంది 'నిజదారసుతోదర పోషణార్థమై పాలికులైన'' వారిలాగా ఇమ్మనుజేశ్వరాధముల కిచ్చి పురంబులు వాహనంబులునే సొమ్ములు కొన్ని పుచ్చుకుని'' అని పోతన్నగారిలాగా గర్జించగలరా? పాలక వర్గాన్ని పట్టుకుని సకారణంగాగాని అకారణంగాగాని మనుజేశ్వరాధము లనటానికి ఎన్ని గుండెలు కావాలి? పైపెచ్చు "కొన్ని" సొమ్ములని తూస్కారంగా? నాకు భాగవతమూ వద్దు భోగిని దండకమూ వద్దు ఆ ఒక్క పద్యమూ చాలు అది నేను రాసి ఉండకూడదూ?

ఆ మధ్యకాలపు కవుల్లో నన్నెవరూ ఆకర్షించటం లేదు. ఆరో అక్షరం తకారం పెట్టి చంపటంలో నాకు విశ్వాసం లేదు. "శుభమగుగాతనకు" అని ఎవరిమీదనన్నా పద్యం చెబితే వాళ్లు కాస్తా చచ్చి ఊరుకుంటారంటే నమ్మను. ఒకవేళ చచ్చేదే నిజమైతే అందులో కవితాభావం ఏమీ ఉందనుకోరాదు. అదీకాక ఇట్లా చంపేవారిని హంతకులకింద విచారణచేసి ఉరి తీయవలసి ఉంటుంది.

ఆరింట ''త'' పెట్టి చంపటమేగాదు, కవిత్వంద్వారా శపించటంలోకూడా నాకు నమ్మకం లేదు. "ఆహా మే నిన్ను గరవ అయ్యలగురవా'' అన్న కవి గోడమీద పామును చూసే ఆమాట అనిఉండాలి.

చిత్రబంధ కవిత్వాలుకూడా ఎందుకో నన్నాకర్షించటంలేదు. "ధీరవిరామా కుజవర ధీరవరామా కనయన ధీ వరవరధీ ధీరవరవధీన యనకమారావరధీవజ కుమారా విరధీ'' అనే పద్యం ఎటు చదివినా ఒకటిగానే ఉంటుందంటే నిజమో కాదోకూడా నాకు చూసుకో బుద్ధిపుట్టలేదు. అల్లసాని పెద్దన ఆశువుచెప్పి రాయలచేత గండపెండేరం తొడిగించుకున్నాడు. గనక నేను కూడా ఆశుధార చెప్పాలని కాస్త ఊగుతున్నప్పటికీ పానుగంటివారి కంఠాభరణంలో రామలక్ష్మణులు జ్ఞాపకంవచ్చి ఆకోరిక ఇగిరి చక్కాపోతున్నది.

ఇన్నిమాటలనుకోవటమే కాని నేనే కవినైతే ఎన్నడో పుట్టిగిట్టిన కవుల జాడల్లో పోదామనుకోవటం దేనికి? నాకు దగ్గర్లో లేరా దిగ్గజాల్లాంటి కవులు? వేదుల, దేవులపల్లి, అబ్బూరి, నండూరి, దువ్వూరి, విశ్వనాథ, నల్లావఝుల, నోరి, నాయని, బసవరాజు, శ్రీ శ్రీ—వీరంతా ఎంతటి ప్రజ్ఞావంతులు కారు?

ఇంతమందిని చూడగానే ఒక్కటే అనుమానం! ఇంతమంది అయిపోవటమా, లేక కొందరే అయిపోవటమా అని తేల్చుకోవటం చాలా కష్టం. ఇంకా స్థూలంగా ఆలోచిస్తే భావకవికానా, దేశభక్తికవికానా, విప్లవ కవికానా?

శ్రీ శ్రీ లాగా విప్లవ కవి అయి జగన్నాథ రథచక్రాలు భూమార్గం పట్టించి భూకంపం పుట్టించటం ఒకవంక ఉపద్రవకరంగా కనిపిస్తుంది. మరోవంక రాయప్రోలులాగా "లేదురా యిటువంటి భూదేవియెందు; లేరురా మనవంటి ధీరులింకెందు'' అనటం బొత్తిగా జడత్వానికి దారితీసేటట్టు కనిపిస్తుంది. గురజాడలాగా ఒక మహత్తరమైన దేశభక్తి సందేశం ఇస్తే చాలా బాగుంటుంది కాని ఏమిటి ప్రయోజనం? ఒక చెంప బౌండరీ కమిషన్లు ఏర్పడుతుండగా, "దేశమంటే మట్టికాదోయ్—దేశమంటే మనుషులోయ్'' అని చెప్పి ఏం లాభం? పైగా దేశభక్తి గీతాలు ఒకదానొకటి ఖండించటంకూడా జరుగుతుంది. "వెనుక చూసిన కార్యమేమోయ్, మంచి గత

మున కొంచెమేనోయ్" అంటాడు గురజాడ. "గోదావరీ పావనోదారవారిపూత మఖిల భారతము మాదన్నవాడు" అంటాడు విశ్వనాథ.

అందుచేత నేను పచ్చి భావకవి నౌతాను. భావకవి కావటంలో చాలా సుఖాలున్నాయి. భావకవి ఒకసారి విహాయసవిహంగమౌతాడు మరుక్షణానే "పాతాళలోకంపుటిరుంకుసందులందు దిగబ్రాకు వెరచు గాఢాంధరేఖ" కావటమే కాక "నేనెటు పక్షి నౌదు!" అని కూడా దబాయిస్తాడు. భావకవి కాలేనిది లేదనే అనుకోవచ్చు. అతనొక వియోగ గీతిక, ఒక వియోగశాలినీ హృదయవేదనా రేఖ మొదట ఏ కూడూ లేని పులుగురాయుడుగా ఉండి, సంధ్యా మనోజ్ఞ చిత్ర సింధూర రేఖగా మారి, మెలమెల్లగా రిక్క అవుతాడు. ఆకులో ఆకు, పువ్వులో పువ్వు, కొమ్మలో కొమ్మ, నును లేత రెమ్మ అయిపోగలడు. చేతల దగ్గిర కూడా భావకవికి అడ్డులేదు. ప్రేమించగలడు, నిట్టూర్చ గలడు, గొంతెత్తి ఏడవ గలడు, మధురంగా బాధపడ గలడు. ఈ పనులు చెయ్యటంలోకూడా తన వ్యక్తిత్వాన్ని, విశిష్టతనూ, ప్రత్యేకతనూ నిలబెట్టుకో గలడు. తన గొంతు మూగవోయిందంటూనే తియ్యని గానం చెయ్య గలడు.

"నా మరణశయ్య పరచుకొన్నాను నేనె
ఏనె నాకు వీడ్కోలుపు లిప్పించినాను
ఏనె నాపయి వాలినాను, ఏనె జాలి నెద
నెద గదించినాను, రోదించినాను."

ఇంతకంటె మానవమాత్రుడికి అతీతమైన దేముంటుంది? మామూలు మనిషి ఎవడైనా తన ప్రియురాలిని, "ఓయమావాస్యా తమస్వినీ" అని సంబోధించగలడా?

కనీసం ఇందుకోసమైనా నేను భావకవినై భావకవిత్వం రాస్తాను.

(ఆలిండియా రేడియో సౌజన్యంతో)



★

గవర్నర్ - జనరల్ శ్రీ రాజగోపాలాచారిగారు యిటీవల ఢిల్లీలోని శరణార్థుల కుటీర పరిశ్రమల వస్తుప్రదర్శనం చూడడానికి వెళ్లినప్పటిదృశ్యం.

★